కథ

రంగు రంగుల ఊలుదారాలు మార్కెట్లోకి వచ్చాయి. వ్యాపారస్తులు ప్రతి సంవత్సరం నవంబర్లో కొత్త స్టాకుతో నింపేస్తారు. షో కేసుల్లో చక్కగా అమర్చి అందరినీ ఆకర్షించేందుకుగాను దుకాణాల ముందట ఊలు గుత్తుల్ని వేలాడదీస్తారు.

మైన్యా ఊలుని మార్కెట్‌నుండి కొనుక్కొచ్చింది. చూడ్డానికి నల్లగా ఉన్నా దాంట్లో సన్నని తెలుపు చారలున్నాయి. తనకోసమని స్వెటర్ అల్లుకోడానికి తెచ్చుకొంది. కొనేటప్పుడు తన శరీర ఛాయని దృష్టిలో ఉంచుకొని తనకు చక్కగా సరిపోయేట్టుగా మరీ ఎంపిక చేసుకొని తీసుకుంది. తన తెలుపు రంగు దేహానికి నలుపు బాగా సరిపోయింది. తెలుపు చారలు నలుపు రంగు గాఢతని తగ్గించి ఊలుకి ఓ రకమైన అందాన్ని తెచ్చింది. మొత్తానికి ఎంపిక చేసుకున్న ఊలుతో మైన్యా ఎంతో సంతోషించింది.

# స్వెటర్

నేపాలీ మూలం : బి.పి. కోయిరాలా

అనువాదం : టి. సంపత్‌కుమార్

మధ్యాహ్న భోజనం అయ్యాక స్వెటర్ అల్లడానికిగాను మైన్యా కూచుంది. ఇరుగు పొరుగు నుండి ఆమె స్నేహితులు కూడా వచ్చి మైన్యాతోపాటు కూచొని తమతో తెచ్చుకొన్న ఊలు-సూదులతో అల్లడం మొదలుపెట్టారు. ఊలు దారాలు క్రమేణా వివిధ ఆకారాల్లోకి మారుతున్నాయి. స్వెటర్లు, సాక్స్, గ్లవ్స్, జాకెట్లు... ఇలా మాటల మధ్య రూపం పోసుకుంటున్నాయి. అందరూ మైన్యా తెచ్చిన ఊలుని చూసి ఎంతో మెచ్చుకున్నారు. కొందరు ఎక్కడ కొన్నావని అడిగితే మరికొందరు ఖరీదెంతని అడిగారు.

ఒక్కొక్కరూ ఆసక్తితో మైన్యా ఊలుని ముట్టి చూశారు. గుండ్రంగా ఉన్న ఊలు బంతుల్లోకి వేళ్ళని చొప్పించి దారాల్ని పరీక్షించి మరీ చూశారు. అందరూ మెచ్చుకోలుగా "అవును.... ఇది నిజంగా నాణ్యమైన ఊలు..." అని కితాబిచ్చారు.

ఇదంతా గమనించి మైన్యా అల్లడం ఆపి "ఈ ఊలు ఆ ఒక్క మార్వాడి దుకాణంలోనే దొరుకుతుంది. అందరూ అక్కడే కొంటున్నారు. మీకు నచ్చితే మీరూ వెంటనే వెళ్ళి కొనండి..." అంది.

కాస్సేపయ్యాక అప్పటివరకు అల్లిన ఓ నాలుగంగుళాల ముక్కని మైన్యా తన చెక్కిలిపై పెట్టుకుని "ఎలా కనబడుతుంది?" అని అడిగింది.

"చాలా బాగుంది..." అందరూ ఒక్కసారే బదులిచ్చారు.

"నీకేమమ్మా! మాకు నీలాంటి రంగు లేదు." బిమల అంటూ తన చేతుల్ని తిప్పుతూ "నాలాంటి చర్మపు రంగుకి ఈ ఊలు రంగు నప్పదు" అని కూడా అంది. బిమల మాటలతో జానకి ఒప్పుకున్నా నలుపురంగు వారి పట్ల వ్యక్తపరచిన తన తేలిక అభిప్రాయంతో ఏకీభవించలేదు. అందుకే తన రంగు చామనఛాయైనా, ఆ రంగు ఊలునే కొనుక్కోవాలని మనస్సులో అనుకుంది.

ఈ సంభాషణ తరువాత ఎవరి పనిని వారు చేసుకుంటున్నారు. కొంచెం సేపటివరకు ఆ గదిలో ఎలాంటి శబ్దం లేదు. అందరి చేతివ్రేళ్ళు లోనికి బయటికి పాములాలుకల్లా కదులుతున్నాయి. మైన్యా ప్రశ్నతో అక్కడి నిశ్శబ్దం చెదిరిపోయింది.

"ఏయ్... ఇంతకీ ఈ డిజైన్‌లో ఎన్ని రింగులు వేయనూ?..." జానకికి తెలుసుకోవాలని ఉన్నా లేనట్టుగానే నటిస్తూ అడిగింది. "ఎవరికోసం ఈ స్వెటర్ని అల్లుతున్నావ్. ఆ వ్యక్తికి ఒకవేళ పెద్ద బొజ్జ ఉంటే ఇంకా కాస్త పెంచాలి. సన్నగా ఉంటే కొన్ని కుట్లు తగ్గించు. ఈ స్వెటర్‌ని ఎవరికోసం అల్లుతున్నావో తెలియకుండా ఎన్నని అడిగితే ఎలా చెప్పగలం? చెప్పు... ఎవరా అదృష్టవంతుడు?...."

జానకి మాటలతో మైన్యాకి కోపం వచ్చింది. మొహమాటం లేకుండా అంది. "జానకి ఎప్పుడూ కారణం లేకుండా మాట్లాడుతుంది. ఈ స్వెటర్ని నా కోసమే అల్లుతున్నాను.... అర్థమయ్యిందా నీకిప్పుడు?..." మరింత కోపంతో అంది.

అక్కడున్న అమ్మాయిలంతా నవ్వాపులేక పోయారు. తరువాత మైన్యా ఆలోచించింది. చక్కగా అల్లుతున్న స్వెటర్ని ఎవరికైనా ఇస్తే బాగుంటుంది. మన కోసమే అల్లుకోవడంలో తృప్తి ఏమీ ఉండదు కదా?

జానకి మళ్ళీ సాగించింది. కాని ఈసారి ఆమె మాటల్లో ఏమాత్రం వ్యంగ్యం లేదు.

"నీ కోసమే అల్లుకున్నట్టయితే డెబ్బై రింగులు చాలు.. ఎనభై వరకెళ్ళినా పరవా లేదు..."

మైన్యా అల్లుతూనే ఉంది. ఆమె ఓ నిర్ణయానికి వచ్చింది. తనలో తానే అనుకొంది..." చూద్దాం. చివరికి ఎలా వస్తుందో.. అప్పుడు చూసి ఎవరికి య్యాలో నిర్ణయించుకొంటాను..."

అప్పటివరకు నిశ్శబ్దంగా ఉన్న హరిమాయ అంది... "ఏయ్ మెడని ఎలా అల్లుతారో నాకు తెలియదు..." చెబుతారా అన్నట్టుగా అందరివైపు చూసింది.

బిమల వెంటనే హరిమాయనుండి ఊలునూదుల్ని తీసుకొని మెడని అల్లడం మొదలుపెట్టింది. మరిమాయ పూర్తి ధ్యానంతో అల్లడం వైపే చూస్తూ ఉంది.

రోజురోజుకి మైన్యా అల్లుతున్న స్వెటర్ రూపం పోసుకుంటుంది. తాను దాన్ని ఎవరికివ్వాలో నిర్ణయించుకొంది. "నేను ఈ స్వెటర్ని గజరాజ్‌కిస్తాను." అని మనస్సులో అనుకొంది. "అయనైతే చాలా సంతోషిస్తాడు. ఒకసారి తనకోసం స్వెటర్ అల్లమని తననడిగాడు. తన చేతులద్వారా అల్లిన స్వెటర్ని ధరించడం తనకిష్టమని కూడా అన్నాడు. అందువల్ల ఈ స్వెటర్ గజరాజ్‌కా! దీనికి 'వి' ఆకారపు నెక్‌ని అల్లుతాను..." అని మైన్యా అనుకుంది.

స్వెటర్ పూర్తికావచ్చింది. చూస్తే అంత బాగా అనిపించలేదు. ఆకర్షణీయంగా లేనే లేదు. దిండు కవరుగా కనబడుతుంది! మైన్యాకి బాధగా ఉంది. కానుకగా ఇవ్వడానికి సరిపోదు. తాను కూడా ధరించేటట్టుగా లేదు. మరేమార్గం లేక స్వెటర్ని ఇంట్లో నౌకరుగా పనిచేస్తున్న రామెకిచ్చింది.

"ఇది నీ కోసం రామె" అని స్వెటర్నిస్తూ మైన్యా అంది. నౌకరు నమ్మలేక తబ్బిబ్బై పోయి నవ్వు మొహంతో స్వెటర్నందుకొని కృతజ్ఞతలు తెలిపాడు. నవ్వడంతో రామె మొహంనిండా ముడతలు పడ్డాయి. మైన్యా చివరగా అంది. "ఈ స్వెటర్ని నేనే అల్లాను..." రామె అధిక సంతోషాన్ని చూసి మైన్యా ఎంతో ఆనందించింది. తన శ్రమ వృధా కాలేదని అనుకొంది. రామెలాంటి వానికి ఏదో ఒకటి ఇవ్వడంలో ఎంతో సంతృప్తి వుంది. ఒకవేళ స్వెటర్ చక్కగా కుదిరి గజరాజ్‌కిచ్చినా ఆయన కూడా ఎంతో సంతోషించేవాడే కాని ఆయన సంతోషాన్ని రామె సంతోషంతో పోల్చలేం.

తరువాత స్నేహితులు కలుసుకున్నప్పుడు వారు మైన్యాని అడిగారు. "స్వెటర్ని ఎవరికిచ్చావ్?"

"రామెకిచ్చాను" మైన్యా మామూలుగా జవాబిచ్చింది. "బాగా కుదరలేదు. అలాంటిదాన్ని ఇంకెవరు ధరిస్తారు?..." అని కూడా అంది. జానకి విని ఊరుకోక "నీ అభిమానాన్ని పొందిన అదృష్టవంతుడతను..." అని గేలిచేసింది.

"జానకి... నీవు అతిగా మాట్లాడుతున్నావ్... హాస్యానికీ ఓ హద్దుంటుంది. "మైన్యా కోపంతో అరిచింది. జానకి చప్పున ఉండే రకం మనిషి కాదు. అక్కడున్న అమ్మాయిలవైపు చూస్తూ "నేనేమైనా తప్పుగా మాట్లాడానా? మైన్యా కష్టఫలాన్ని అందుకున్న అదృష్టవంతుడెవరని మాత్రమే అన్నాను."

"రామె" అని ఒక్కసారిగా అందరూ అన్నారు.

మైన్యా నోటమాట రాలేదు. అలాగే ఉండిపోయింది.

మెల్లమెల్లగా ఈ విషయం అంటే మైన్యా తనకోసం అల్లుకున్న స్వెటర్ని ఇంటి నౌకర్ రామెకిచ్చిన సంగతి అందరికీ తెలిసిపోయింది. ఇరుగు పొరుగు ఇళ్ళల్లో ఇదొక హాట్ టాపిక్ అయ్యింది. ముసలివారు చెవులు మూసుకొంటూ "రామ రామ... ఎలాంటి విషయాన్ని వింటున్నాం" అని అనుకొంటున్నారు. అందరూ ఈ విషయం పట్ల ఎంతో ఆసక్తిని చూపుతున్నారు. మైన్యా సరైన పనిచేయలేదంటూ అందరూ అభిప్రాయపడ్డారు.

ఓరోజు మైన్యా దగ్గర్లో ఉన్న స్నేహితురాలింటికి వెళ్ళింది. స్నేహితురాలు మైన్యాని తాము ఎవ్వరికీ కనబడని చోటికి, మాట్లాడుకున్నా వినబడని చోటికి తీసుకెళ్ళి "జనమంతా నీవు రామెకి స్వెటరిచ్చిన విషయం గురించి మాట్లాడుకుంటున్నారు" అని అంది.

"అయితే ఏంటి?" మైన్యా సూటి సమాధానం.

"ఏం కాలేదు... కాని చుట్టంతా వదంతులు వినబడుతున్నాయి. ఒకవేళ నీవు రామెకే ఇవ్వాలనుకొంటే ఎవ్వరికీ తెలియకుండా రహస్యంగా ఇచ్చుకోవచ్చుకదా? ఊరంతా తెలిసేటట్టు చేయాల్సిన అవసరం లేదు కదా?" స్నేహితురాలు వివరించి నచ్చచెప్పే ప్రయత్నం చేసింది.

మైన్యాకి ఒక్క క్షణం దోషిలా అనిపించింది. "రామెకి స్వెటరివ్వడం తప్పా? జనం గోరంత విషయాన్ని కొండంతలు చేసి కథలల్లుతుంటే దానికి నేనేం చెయ్యను? ఊరందరి నోళ్ళను నేను మూయలేనుగా?..." స్నేహితురాల్ని తిరిగి ప్రశ్నించింది మైన్యా.

"నీవు తప్పు చేశావని నేననడం లేదు...." జవాబిచ్చి స్నేహితురాలు ఇంకా సంభాషణ సాగించింది.

"నీవు ఆ పనిని తెలివిగా చేయలేదని మాత్రమే అన్నాను. ఈ విషయం పట్ల నాకే కొంచెం అనుమానంగా ఉంది. స్వెటర్నివ్వడానికి నీకు ఇంకెవ్వరూ దొరకలేదా? ఓ నౌకరికివ్వాల్సి వచ్చిందా?

మైన్యా కోపంతో ఊగిపోయింది. "నౌకరు మనిషికాదా?" అని గట్టిగా అరిచింది. మారుతున్న ఈ కాలంలో సమానత వైపు పోతున్న సమాజంలో నీవింకా యజమాని, నౌకర్ల మధ్య బేదాలని చూపే ధైర్యం చేస్తావా?... ఫరవాలేదు... అందరూ ఎలా అనుకొంటే అలానే అనుకోనీ... నిజం చెప్పాలంటే ప్రేమ ఎవరి వశంలోనైనా ఉంటుందా?"

అసంకల్పితంగా తన నోటినుండి వచ్చిన మాటల్ని విని మైన్యా ఒక్కసారే ఉలిక్కిపడింది. "నేనేమన్నాను?" అని తనను తానే ప్రశ్నించుకుంది. "ప్రేమా? ప్రేమ అనే శబ్దం ఎక్కడినుండి వచ్చింది?" కాని అప్పటికే తాను ఎంతో కోపాన్ని ప్రదర్శించింది. కావున ఇప్పుడా విషయం ప్రస్తుత పరిధిలోకి రాదు.

మైన్యా ఇంకా సాగించింది.

"ప్రేమ దేని గురించి పట్టించుకోదు. అది భగవంతుడిచ్చిన ప్రసాదం. అది చిన్నా, పెద్దా, ఉచ్చ, నీచ స్థితుల బేదభావాల్ని చూడదు. బాహ్య దృష్టి చూసే దానికి భిన్నంగా చూస్తుంది. అంతర దృష్టి..."

మైన్యా మాటల్ని విని స్నేహితురాలు జవాబిచ్చింది.

"మైన్యా... నీవు కోపంతో ఉన్నావు. నీవు చెప్పింది అక్షరాలా నిజం. నిజమైన ప్రేమ మన సమాజ కట్టుబాట్లు, సంస్కృతిని గుర్తించవు. రామె కేవలం ఒక నౌకర్. అయినంత మాత్రాన నీ ప్రేమకు నోచుకునే మనిషి కాదని నేననడం లేదు. కాని సమాజంలో హద్దులనేవి కొన్ని



ఇందూరు భారతి నిజామాబాద్ జిల్లా సాహితీ సమాఖ్య ద్వారా (7-5-2009న) శ్రీ అంబల్ల జనార్దన్‌గారికి 'ఆత్రేయ సాహితీ పురస్కారం' చిత్రంలో ఈర్ల రాజేందర్, రాంబట్రి గంగాధర్, వి.పి. చందన్‌రావు, అమరేశ్వర్, కందాళై రాఘవాచార్య, అంబల్ల జనార్దన్, కొండ రాజశేఖరగౌడ్, చింతల గంగాదాస్, యశ్వంతరెడ్డి, ఓంకార్‌లు ఉన్నారు

ఉంటాయి. నీవు రామెలో అలాంటిదేమైనా చూశావంటే అది నాకు ప్రపంచంలోని ఎనిమిదవ అద్భుతమనిపిస్తుంది. ఇంకో విషయం... ఆయన నీకంటే ఎంతో పెద్ద. వయస్సు ముప్పై ఐదు సంవత్సరాలు... నీకేమో ఇరవై ఒక్క సంవత్సరాలు కూడా దాటలేదు..."

మైన్యాకి స్నేహితురాలి బూజుపట్టిన భావాలు అస్సలు నచ్చలేదు." నీకు ప్రేమంటే ఏంటో తెలియదు. నీవనుకునే ప్రేమ ధనంలో, సంతోషంలో, హావభావాల్లో ఉంటుంది. నాకు తెలిసిన ప్రేమ దీనికి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. నీ కిప్పుడు అర్థమవుతుందా?..." అనేసి మైన్యా అక్కడినుండి విసురుగా వెళ్ళిపోయింది.

తమ యజమాని కూతురు అక్కడినుండి వెళ్ళిపోయిందని తెలిసాక మిగతా నౌకర్లు రామెని గేలిచేయడం మొదలుపెట్టారు.

"రామె.. ఇంకేం కావాలి నీకిప్పుడు..." అని అందరూ అడుగుతూ ఆటపట్టించారు.

"యజమాని కూతరు స్వయాన తన చేతుల్తో అల్లిన స్వెటర్ని నీకిచ్చింది. ఓ మూర్ఖుడా... అర్థం చేసుకో... ఇంకా అర్థం కాలేదా?..."

ఇబ్బందిగా రామె తన చేతిని స్వెటర్‌పైకి పోనిచ్చాడు.

మృదువుగా సృశిస్తూ ఉండిపోయాడు.

గదిలోకి ప్రవేశించిన మైన్యాకి నౌకర్ల మాటలు అప్రయత్నంగానే వినబడుతున్నాయి. నౌకర్లు ఒక్కచోట గుమిగూడి రామెని అల్లరి పట్టించడం ఆమెకి నచ్చలేదు. కాని అక్కడికెళ్ళి వారందరిని చివాట్లు పెట్టేందుకు ఆమె సాహసించలేదు.

# నానీలు

**– ఆర్.కె. కటారి**

హైదరాబాద్
ఇప్పుడు
జనారణ్యమే కాదు
కార్లడవి కూడ!

మతం
సమ్మతమే
మౌఢ్యం – అవశ్యం
విడనాడవలసిన జాడ్యమే!

చావటమే కాదు
ఆత్మని చంపి
బ్రతకటం కూడ
ఆత్మహత్యే!

సామెత...
తన కంపు – తన కింపు
పరుల కంపు
పాసిష్టి కంపు!

# ☺ హాస్య చినుకులు ☺

"నీ కళ్ళలోకి చూస్తూ అన్నికష్టాలు మరిచి పోతానుడియర్" అన్నాడు ఆనంద్.
"ఇంకా మనపెళ్ళే కాలేదు,అప్పుడే నీకు కష్టాలేమిటి ఆనంద్" అందిప్రియురాలు.

☺ ☺ ☺

"టి.వి.లో వార్తలు చదివే గజలక్ష్మి ఈ మధ్యన కనిపించడం లేదేమిట్రా" అడిగాడు వర్మ
"ఆవిడ ఈ మధ్యనమరీ లావెక్కి పోర్టబుల్ టి.వి.లో పట్టక పోవటం వల్ల తొలగించారటరా" అన్నాడు శర్మ.

☺ ☺ ☺

మానాన్నఏటాపిక్ మీదైనా గంటలకొద్దీ మాట్లాడగలడు" అన్నాడుగిరి.
"ఆవిషయంలో మీనాన్నకంటే మాఅమ్మబెటర్"
"ఎలాచెప్పగలవు.?"
"ఆవిడ ఏటాపిక్ లేకపోయినా గంటలకొద్దీ మాట్లాడగలదు"చెప్పాడు హరి.

☺ ☺ ☺

**డాక్టర్ :** ఏదీ నీ నాలుక కాస్త బైటపెట్టు! వూ!ఇంకా.... ఇంకా...!
**వెంగళప్ప:** ఇంకా రావడంలేదు డాక్టర్! అవతలపక్కగట్టిగా అతుక్కుపోయింది.

☺ ☺ ☺

**భర్త:** పొద్దున్నషాపింగ్ వెళ్ళి నాకేంతెచ్చావ్?
**భార్య:** నిద్ర మాత్రలు
**భర్త:** అవి నాకెందుకు?
**భార్య:** నేను పదివేలు పెట్టి కొన్న పట్టుచీర చూసి ఎలాగూ నిద్రపట్టదు కదా! అందుకని.

☺ ☺ ☺

ముగ్గురు మిత్రులు కలిసి సినిమాచూసి వస్తూండగా మార్గమధ్యంలో వర్షం వచ్చింది.
**ఒకడు:** నాకేం ఫరవాలేదు,నాదగ్గరగొడుగుంది.
**ఇంకొకడు:** నాక్కూడా ఫర్వాలేదు ,నాది ఎలాగూ బట్టతలే.
**మరొకడు:** నాక్కూడాఫర్వాలేదు,నేను ఉదయం స్నానం చేయలేదు.

☺ ☺ ☺

**యజమాని:** రండి సమయానికి వచ్చారు,కాళ్లు కడుక్కోండి,భోజనం చేద్దురుగాని!
**అతిథి:** ఫరవాలేదులెండి! చేతులతో నే భోజనంచేస్తాను!

**– వై.కె.మూర్తి**